# సింగిల్‌పేజి కథలు

## ప్రాప్తం



గ్యాస్‌పై కుక్కర్ పడేసి ఉస్సూరంటూ సోఫాలో కూలబడింది సుష్మ. ప్రొద్దుటి నుంచి జరిగిన సంఘటనలు తెరలు తెరలుగా జ్ఞాపకం రాసాగాయి.

తను ప్రొద్దున్నే ఎంతో సంతోషంగా మార్కెట్‌కు వెళ్ళి కావలసిన కూరగాయలు కొంటూంటే జరిగిందా సంఘటన. ఎవరో గట్టిగా తన ముంజేతిని తాకడంతో చేతిలో మామూలుగా పట్టుకున్న హ్యాండ్ పర్స్ గాల్లో ఎగరడం అది నేలనైనా తాకకుండానే మాయమైపోవడం క్షణాల్లో జరిగిపోయింది.

ఈ హఠాత్పరిణామంతో చిత్తరువులా నిలబడిపోయింది. మరుక్షణంలో మేల్కొని చుట్టూ కలయ జూసింది. ఏ చేతిలోనైనా తన పర్సు అగుపడ్తుందేమోనని మార్కెట్ కలియ తిరిగి అందరి వైపు చూసింది. లాభం లేకపోయింది. పర్సులో రెండొందలపైగా చిల్లరతో పాటు ఇంటి తాళం చెవులు కూడా పోయాయి. ఆ వెధవెవడో డబ్బులు తీస్కొని ఆ పర్సు పడేసినా బాగుండు. తాళం చెవులైనా దక్కేవి. దొంగపీనుగ పద్ధతిగా చేసాడీ దొంగతనం. రకరకాలుగా మనసులో తిట్టుకుంటూ ఆటోని కేకేసి ఆటో ఎక్కేసి కూర్చుంది. మనసంతా గజిబిజిగా తయారైంది. ఆటోలో కూర్చుందన్న మాటేకానీ మనస్సంతా ఆలోచనలే. ఇప్పుడేం చేయాలి? తన చేతిలో పైసా లేదు. పక్కింటి వారి నడిగితే డబ్బులిస్తారు గానీ ముందు సానుభూతి చూపించి వెనుక ఇంకొకరి ముందు ఎగతాళి చేస్తారని ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. ఆటోని తన ఇంటి దగ్గరలో ఉన్న షాపు ముందాపించింది. షాపువానికి జరిగింది క్లుప్తంగా చెప్పి, తరువాతిస్తానని మూడొందలు తీస్కొని ఆటో అతనికిచ్చి పంపించేసి, ఆ పక్కనే ఉన్న తాళాలు తీసే అతన్ని పిలుచుకొని వచ్చింది. అసలే డోర్ లాక్ పైగా తాళం కప్ప వేసి మరీను. రెండూ తీసేసరికి రెండొందలొదిలాయి.

కుక్కర్ వేసిన విజిల్‌తో ఆలోచనల్లోంచి బయట కొచ్చి గ్యాస్ ఆర్పటానికి వంటింటి వైపు కదిలింది.

ఇంతలో కాలింగ్ బెల్ మోగటంతో వెళ్ళి తలుపుతీస్తే ఎదురుగా పిల్లలు. వారి మాటలు అల్లరితో కాస్త మనసు నెమ్మది పడినా దిగులు చికాకు పూర్తిగా పోలేదు. పిల్లలతోపాటు భోజనం ఇంటి పనులు ముగిసే సరికి సాయంత్రమయింది. పిల్లలు వాళ్ళలో వాళ్ళు చదువుకుంటూ మాట్లాడుకుంటున్నారు. పిల్లల అల్లరితో పాడయిన ఇంటిని శుభ్రం చేసి ముఖావంగా తయారయి హాల్లోకి రావడంతోటే కాలింగ్ బెల్ మ్రోగింది. తలుపు తీస్తే ఎదురుగా శ్రీవారు. "అరే! ఈరోజు తొందరగా వచ్చేసారే!"

"ఈరోజు ఆఫీసు పని త్వరగా ముగిసిందిలే" అంటూ నా వైపు చూసి "నువ్వేంటలా ఉన్నావ్?"

"ఏం చెప్పనండీ?" అంటూ జరిగిందంతా దిగులుతో మెల్లిగా చెప్పింది తను.

"సరేలే! జరిగిందేదో జరిగింది దిగులు పడకు. ఊహించని రీతిలో దొంగతనాలు పెరుగుతున్న ఈరోజుల్లో చాలా జాగ్రత్తగా వుండాలి. ముందు జాగ్రత్తతో మనం తాళం కూడా మార్చటం మంచిదేమో! సరేలే తలుపేసుకో. నేనలా బజారుకెళ్ళి మరో తాళం కొని కొట్టువానికి డబ్బులిచ్చి వస్తా" అని రోడ్డున పడ్డాడు భాస్కరం.

ఓ రెండ్రోజుల తర్వాత పదిగంటల వేళ కాలింగ్ బెల్ మ్రోగితే వెళ్ళి తలుపుతీసింది. ఎదురుగా దోబి రాజమ్మను చూసి "నువ్వా రాజీ నిన్ననగా పిలిస్తే ఈ రోజొచ్చావా? బట్టలిక్కడే కవర్లో ఉంచా ఇంద తీస్కో"

"ఏం జెయ్యాలమ్మగోరూ! మా సంటోడికేమో బానేదాయె. డాటోరుబాబు దగ్గరెళ్ళి సూది మందులిప్పించినానాయె" అంటూ అదేదో చెప్తోంది గాని అవి నా చెవిలో దూరటం లేదు. నా చూపులన్నీ దాని చేతిలోనున్న పర్సు మీదున్నాయి. అదా విషయం గమనించినట్లుంది. "ఈ పరుసామ్మగోరు! ఇది నాదేనండీ ఎలాగాంటారాండీ? ఇందాక గుడ్డలిద్దామని ఆ పోలీసమ్మగోరాండీ అదేనండీ ఆ కామాచ్చమ్మగారింటి కెళ్ళానాండి. అక్కడ బల్లమీనుండాండీ గీ పరుసు. మా బాగా నచ్చేసిందండీ. అప్పుడ్నేనన్నానమండీ కామాచ్చమ్మగోరూ మీరు నాకు నలభై రూపాయలియ్యాలా అదొగ్గేత్తానండీ నాకా పరుసియ్యమన్న అదట్టుకెళ్ళమన్జెప్పి తరువాజెప్పిందండీ. మొన్నె సంతకాడంటండి దొంగనాయాలు ఈ పరుసు నొక్కేసి పారిపోవటం సూసి ఆ పోలీసాయన గోరు ఆల్లెనకాతలెల్లాడా ఆల్లు దొరక్కుండా పరుసు కిందపడేసి పారిపోయారంటండీ. ఈయన గోరు వంగి పరుసు తీసి సుట్టూ సూత్తె ఆల్లు కన్పన్నెదంటండి పరుసు సూత్తే కాలీ గుందంట. అదండి కథ. అమ్మో! సానసేపయిందమ్మ నేనింక మూడిల్ల కాడెల్లి 'గుడ్డల్దేవాలండీ సానా పనుంది. వత్తానమ్మాగోరం"టూ నేనిచ్చిన గుడ్డల్ని తీసుకుని వెళుతున్న దానివైపు కళ్ళప్పగించి అలా చూస్తుండిపోయాన్నేను. నిస్సత్తువగా అన్పించింది. పర్సునాదయివుండి కూడా నాదని చెప్పుకోలేని స్థితి నాది. ప్రాప్తమంటే ఇదే కాబోలనుకుంటూ తలుపేసుకున్నాను.

**-వరలక్ష్మి నాయక్** (గోవా)

★ ★ ★

ఉదయం ఇంటినుండి బయలుదేరేటప్పుడు ఆకాశం తేటగానే వుంది. మబ్బులు గట్రా ఏమీ లేవు. కాకినాడలో దిగగానే ఆకాశం మేఘావృత్తమైంది. అలాగే పి.ఎఫ్. ఆఫీసుకి వెళ్ళేను. పనికాలేదుగానీ, ఆఫీసులోనుండి ఇవతలకు రాగానే ముసురుపట్టి వాన మొదలైంది. చుట్టుపక్కల ఆటోలు కూడా ఏమీ లేవు.

వానకి తడవకుండా ఎదురుగా ఉన్న బస్సు స్టాపు వద్ద నిలబడ్డాను. ఒకవేళ ఆటో దొరికి బస్సుస్టాండుకి వెళ్ళినా తుని వెళ్ళే బస్సు ఎన్ని గంటలకు వస్తుందో తెలియదు. ఎవరైనా తెలిసినవాళ్ళు కన్పిస్తే బాగుండును. నా ఆలోచనలలో నేనుండగా, 'సుశీలగారూ' అన్న పిలుపు